క్లుప్తంగా

విద్యార్థినుల ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి



తెనాలిఅర్బన్: ఆరోగ్యంపై విద్యార్థినీలు ప్రత్యేక శ్రద్ధ చూపాలని మణిపాల్ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ ఎం.దివ్య పేర్కొన్నారు. గైనిక్ సమస్యలపై జేఎంజె కళాశాలలో శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భాశయ క్యాన్సర్ మొదటి స్థానంలో, బ్రెస్ట్ క్యాన్సర్ రెండోవ స్థానంలో, పురుషుల్లో గొంతు, పెద్ద ప్రేగు క్యాన్సర్‌లు ఎక్కువగా వస్తున్నాయని చెప్పారు. విద్యార్థినులు ఆకుకూరలు, బెల్లం తయారు చేసిన పదార్థాలు, డ్రైఫ్రూట్స్ ఎక్కువగా తీసుకోవాలన్నారు. సమావేశంలో ప్రిన్సిపల్ సిస్టర్ పి.శాంత, వైస్ ప్రిన్సిపల్ సిస్టర్ రోజ్లిన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, విద్యార్థినులు పాల్గొన్నారు.

చెత్త కనపడితే చర్యలు తప్పవు

మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక



తెనాలిఅర్బన్: రోడ్లపై చెత్త కనిపిస్తే చర్యలు తీసుకుంటానని మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక హెచ్చరించారు. 37వ వార్డులో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని ఆమె పరిశీలించి పలు సూచనలు చేశారు. రోడ్ల వెంట ఇటుక రాళ్లు, ఇతర వస్తువులు ఉండటాని గమనించిన ఆమె అసహనం వ్యక్తం చేశారు. వెంటనే వాటిని తొలగించాలని ఆదేశించారు. మురుగు కాల్వల్లో కూడా చెత్త కనిపించకూడదన్నారు. ఆమె వెంట ఆరోగ్యాధికారి మొవ్వా యేసుబాబు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు ఉన్నారు.

మహిళ మెడలో గొలుసు అపహరణ

తెనాలిరూరల్: రోడ్డు వెంబడి నిలబడి ఉన్న మహిళ మెడలోని గొలుసును గుర్తు తెలియని దుండగుడు అపహరించుకెళ్లాడు. పట్టణ రామలింగేశ్వరేట తోట వారి వీధి–1లో ఓ కుటుంబం దుకాణాన్ని నిర్వహిస్తోంది. దుకాణ నిర్వాహకురాలైన మహిళ గురువారం రాత్రి దుకాణం ఎదుట నిలబడి ఉండగా బైక్‌పై వచ్చిన గుర్తు తెలియని యువకుడు ఆమె మెడలోని బంగారు గొలుసును అపహరించుకెళ్లాడు. 112 కి ఫోన్ చేసిన బాధితురాలి కుటుంబం సమాచారం ఇవ్వడంతో వన్ టౌన్ ఎస్ఐ విజయకుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే నివారించవచ్చు



తెనాలిఅర్బన్: రొమ్ము క్యాన్సర్‌ను ముందే గుర్తిస్తే త్వరగా నివారించవచ్చని అర్బన్‌హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ వేముల ప్రియాంక పేర్కొన్నారు. ప్రపంచ రొమ్ము క్యాన్సర్ మాసోత్సవాల్లో భాగంగా శుక్రవారం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి సంవత్సరం అక్టోబర్ మాసాన్ని పింక్ మాసంగా ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్వహిస్తుందని తెలిపారు. 40–50 సంవత్సరాల మధ్య వయస్సు ఉన్నవారికి ఎక్కువగా రొమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం ఉందన్నారు. రొమ్ములో ఏమైనా గడ్డలు ఉంటే వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో గిరిజన సంక్షేమ వసతి గృహ టీచర్లు ఎ.అరుణకుమారి, జి.అనిల్‌కుమార్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా అధికారులు శ్రీకంత ఉమాకంత్, జి.రవికుమార్, బండారు మల్లేశ్వరరావు, తిరువీధుల రాంప్రసాద్ పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని యువతిపై అత్యాచారయత్నం!

తాడికొండ: మతిస్థిమితం లేని యువతిపై గుర్తు తెలియని యువకుడు అత్యాచారయత్నానికి పాల్పడిన ఘటన తాడికొండలో జరిగింది. తెలిసిన వివరాల ప్రకారం తాడికొండలోని పుల్లయ్య కొట్టు సందులో మతిస్థిమితం లేని ఓ యువతి ఆరుబయట నిద్రిస్తుండగా గుర్తుతెలియని యువకుడు అర్ధరాత్రి యువతి గొంతు నొక్కి అత్యాచారయత్నానికి ఒడిగట్టాడు. యువతి తీవ్రంగా ప్రతిఘటించడంతో ముఖంపై గట్టిగా కొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. తప్పించుకొన్న బాలిక ఇంటి ఎదురుగా ఉన్న గేటు కొట్టడంతో స్థానికులు అప్రమత్తమై గాలించగా ఎవరూ కనిపించలేదు. పోలీసులకు సమాచారం అందగా సీసీ ఫుటేజీ పరిశీలించినా ఆచూకీ లభించలేదు. పేద కుటుంబానికి చెందిన వారు కావడంతో స్థానికులే ఖాళీ స్థలంలో పాక నిర్మించి ఆసరాగా ఉంటున్నారు. బాలిక తల్లి ఊరికి వెళ్లడం, అన్న వేరే చోట నిద్రించడం గమనించిన దుండగుడు ఈ అఘాయిత్యానికి పాల్పడేందుకు యత్నించాడే. బాలిక బంధువులు వచ్చి తమకు ఎలాంటి కేసులు వద్దని వారిని తీసుకొని వెళ్లారు.

మీ సంతకమే.. మీ పిల్లల భవిష్యత్‌కు బాట

- మెడికల్ కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ
- మున్నంగి రచ్చబండలో మాజీ ఎమ్మెల్యే శివకుమార్



మున్నంగి గ్రామంలో కోటి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే శివకుమార్

మున్నంగి(కొల్లిపర): మీ సంతకం, మీ పిల్లల భవిష్యత్‌కు బంగారు బాట వేస్తుందని, కోటి సంతకాల్లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పిలుపునిచ్చారు.మండలంలోని మున్నంగి గ్రామంలోని ఆరిగ అశోక్‌రెడ్డి నివాసంలో శుక్రవారం రాత్రి రచ్చబండ, కోటి సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ రాష్ట్ర చరిత్రలో ఎన్నడూ లేని విధంగా మాజీ సీఎం జగన్‌మోహన్ రెడ్డి 17 మెడికల్ కళాశాలల్ని ఏర్పాటు చేశారన్నారు. పలు కళాశాలలు నడుస్తున్నాయని, మరికొన్ని నిర్మాణ దశలో ఉన్నాయన్నారు. మెడికల్ కళాశాలల్ని ప్రైవేట్ పరం చేసేందుకు సీఎం చంద్రబాబు, కూటమి కుట్రలు పన్నుతోందన్నారు.ప్రైవేటు వ్యక్తులకు అమ్మివేయడం ద్వారా లక్షల కోట్లు ఆదాయం పొంది. పేద. మధ్యతరగతి ప్రజల విద్యార్థులకు వైద్య విద్యను అందని ద్రాక్షగా మార్చివేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. మెడికల్ కళాశాలల్ని రక్షించుకుంటేనే భవిష్యత్‌లో పేదవాడి పిల్లలు డాక్టరవుతాడన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రంలో విద్య, వైద్యాన్ని భ్రష్టు పట్టించిన ఘనత చంద్రబాబుకే దక్కుతుందని, ఇప్పటికే ఆరోగ్య శ్రీ బిల్లులు పెండింగ్‌లో పెట్టిన కారణంగా ఆరోగ్యశ్రీ మూతపడిపోయి ప్రజలు ఉచిత వైద్యం కోసం ఆర్రులు చాచాల్సిన దుస్థితి ఏపీలో నెలకొందని విమర్శించారు. కళాశాల ప్రైవేటీకరణకు నిరసనగా కోటి సంతకాల సేకరణ ఉద్యమాన్ని విజయవంతం చేసి కూటమి ప్రభుత్వం కళ్లు తెరిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి, ఆరిగ కోటిరెడ్డి, ఆరిగ అశోక్‌రెడ్డి, ఆళ్ళ శివనాగిరెడ్డి,సుజాత, వేమూరి ధీనమ్మ, కిషోర్‌బాబు,భీమవరపు సంజీవరెడ్డి, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

విద్య, వైద్యానికి పెద్ద పీట వేస్తాం

మంత్రి నాదెండ్ల మనోహర్



ఎంఈవోకు చెక్కు అందజేస్తున్న మంత్రి మనోహర్, జోస్ లుక్కాస్ సంస్థ ప్రతినిధులు

తెనాలిఅర్బన్: తెనాలి నియోజకవర్గ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలను అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక చర్యలను తీసుకుంటున్నామని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. జోస్ లుక్కాస్ సంస్థ ఆధ్వర్యంలో రూ.12 లక్షలతో ఏర్పాటు చేసిన మౌలిక వసతులను కొత్తపేటలోని రావి సాంబయ్య బాయ్స్ మున్సిపల్ హైస్కూల్‌లో శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ముగిసేనాటికి అన్ని ప్రభుత్వ పాఠశాలలు, వైద్యశాలలో ఎటువంటి మౌళిక వసతులు కొరత లేకుండా చూస్తానని హామీ ఇచ్చారు. జోస్ లుక్కాస్ సంస్థ ప్రతినిధులు రూ.12లక్షలతో ఆరు మున్సిపల్ పాఠశాలలకు ఛైర్స్, బెంచీలు, కంప్యూటర్లు, బీరువాలు సమకూర్చడం అభినందనీయమన్నారు. పట్టణంలోని పలు ప్రభుత్వ పాఠశాలలను దత్తత తీసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ జె.రామ అప్పలనాయుడు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో మౌళిక వసతుల కల్పనకు మున్సిపల్ నిధులు వెచ్చిస్తున్నట్లు చెప్పారు. దాతలు ముందుకు వచ్చి ఇలాంటి సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు. తహశీల్దార్ గోపాలకృష్ణ మాట్లాడతూ విద్యార్థి దశలోనే ఉన్నత లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించే దిశగా కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు కూడా విద్యార్థుల అభ్యున్నతికి పాటుపడ్డాలన్నారు. అనంతరం పాఠశాలల హెచ్‌ఎంలకు మౌలిక వసతులకు సంబంధించిన చెక్కులను మంత్రి మనోహార్ అందజేశారు. అలాగే జోస్ లుక్కాస్ సంస్థ మేనేజర్ వినోద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో మేకల లక్ష్మీనారాయణ, వి.జయంతిబాబు, జోస్ లుక్కాస్ సంస్థ పీఆర్‌వో షేక్ బాబు, ప్రధానోపాధ్యాయురాలు కె.భారతి, తదితరులు పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన



మాట్లాడుతున్న ఝాన్సీవాణి

తెనాలిటౌన్: భూసార పరీక్షలపై విద్యార్థులకు అవగాహన పెంపొందించుకుని, రైతులకు అవగాహన కల్పించాలని భూసార పరీక్ష కేంద్రం గుంటూరు వ్యవసాయాధికారి ఎం.ఝాన్సీవాణి సూచించారు. రూరల్ మండలం అంగలకుదురు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు భూసార పరీక్షల అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గుంటూరు వ్యవసాయాధికారి ఎం.ఝాన్సీవాణి పాల్గొని మాట్లాడారు. స్కూల్ సాయిల్ కార్యక్రమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రతి మోడల్ స్కూల్‌కు లక్ష విలువైన భూసార పరీక్ష మొబైల్ కిట్‌లను ఇవ్వనున్నట్లు తెలిపారు. భూసార పరీక్ష ఏ ప్రదేశంలో తీయాలి, ఎక్కడ తీయకూడదు, ఎంత లోతుల్లో తీయాలి అనే విషయాలను విద్యార్థులకు వివరించారు. భూసార పరీక్ష పత్రాలు వాటిలో ఉన్న పోషక విలువలు గురించి విద్యార్థులకు వివరించారు. భూసార పరీక్ష పత్రాలు ఆధారంగా ఎరువులు వాడకం చేపడితే రైతులకు పెట్టుబడి తగ్గుతుందని తెలిపారు. ఈ విషయాలను రైతులకు వివరించాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి కె.సుధీర్‌బాబు, స్కూల్ ప్రిన్సిపల్ ఎస్.అనురాధ, సైన్స్ ప్రిన్సిపల్ ఆర్.శ్రీదేవి, ఉద్యానశాఖ సహాయకులు జి.శివసత్యం, తదితరులు ఉన్నారు.

నేడు రెండు వార్డుల్లో మంచినీటి సరఫరా నిలిపివేత

తెనాలిఅర్బన్: రక్షిత మంచినీటి పైపులైను మరమ్మతుల కారణంగా 7,10 వార్డుల్లో శనివారం మంచినీటి సరఫరాను నిలిపివేస్తున్నట్లు కమిషనర్ అప్పలనాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఆదివారం యథావిధిగా నీటి సరఫరా జరుగుతుందన్నారు. ఆయా వార్డు ప్రజలు సహకరించాలని సూచించారు.

యువకుడు ఆత్మహత్య

తెనాలిరూరల్: తెనాలి మండలం తేలప్రోలు గ్రామానికి చెందిన యువకుడు మహబూబ్ ఖాన్ (20) శుక్రవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పట్టణ ప్రకాశం రోడ్డులోని ఓ జిమ్‌లో ట్రైనర్‌గా పనిచేస్తున్న అతను తెల్లవారుజామున ఇంట్లో ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు తెనాలి ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ప్రేమ వ్యవహారమే మహబూబ్ ఖాన్ ఆత్మహత్యకు కారణంగా తెలుస్తోంది. రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

హత్య జరిగిన తీరుపై పరిశీలన

తెనాలిరూరల్: పట్టణ చెంచుపేట మాజీ ఎమ్మెల్యే బజారులో జరిగిన జూటూరి తిరుపతిరావు హత్య కేసులో పోలీసులు అదుపులోకి తీసుకున్న నిందితుడిని శుక్రవారం ఘటనాస్థలానికి తీసుకెళ్లారు. హత్య చేసిన విధానం గురించి సీన్‌ను రీకన్‌స్ట్రక్ట్ చేసిన అనంతరం నిందితుడు గండికోట వెంకట సుబ్బారావును కోర్టులో హాజరుపరిచారు.

బాధిత కుటుంబంపై అక్రమ కేసులు!

ఎస్పీ కార్యాలయం ఎదుట ప్లకార్డులతో బాధితుల నిరసన

నగరంపాలెం: బాధిత కుటుంబంపై, సాక్షులపై అక్రమ కేసులు బనాయించారు. అధికార అండతో 11 మందిపై తప్పుడు కేసులు నమోదు చేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని మేడికొండూరు సిరిపురం గ్రామానికి చెందిన బాధిత మహిళలు వాపోయారు. నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయం (డీపీఓ) ఎదుట శుక్రవారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. సిరిపురం బాలిక కేసులో బాధితులపై, సాక్షులపై మేడికొండూరు పీఎస్ సీఐ అక్రమ కేసులు బనాయించారని, తప్పుడు కేసులు నమోదు చేయించి, పలుకుబడి ఉన్న నరేంద్రను వెంటనే అరెస్ట్ చేయాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. అనంతరం మీడియాతో దివ్యవాణి మాట్లాడుతూ గత నెల్లో సిరిపురం గ్రామంలో జరిగిన కొట్లాట కేసులో వారిని ఈ నెల 2న అరెస్ట్ చేశారన్నారు. సాక్షులుగా ఉన్న 11 మందిపై మేడికొండూరు పోలీసులు అక్రమ కేసులు బనాయించారని వాపోయారు. వేరే అమ్మాయి దుస్తులను నేను చించానంటూ నాపైన కేసు నమోదు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. తాడికొండ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ పలుకుబడితో అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆరోపించారు. మరో బాధితురాలు శ్రీవల్లి మాట్లాడుతూ తమపై దాడికి పాల్పడిన వారిని అరెస్ట్ చేసిన రోజు రాత్రి ఎస్ఐ తమపై తప్పుడు కేసులు బనాయించారని వాపోయారని. ఇప్పటికీ గ్రామంలో తమపై దాడులకు పాల్పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 11 మందిపై నమోదు చేసిన అక్రమ కేసుల్లో చదువుకునే పిల్లలు ఉన్నారని బాధితురాలైన జయరాణి వాపోయారు. తక్షణమే అక్రమంగా బనాయించిన కేసులను ఎత్తివేయాలని కోరారు.

నిబద్ధతతో పనిచేస్తే సముచిత స్థానం

- మాజీ ఎమ్మెల్యే శివకుమార్
- మున్నంగిలో గ్రామ, వార్డు స్థాయిలో అనుబంధ సంఘాల కమిటీల ఏర్పాటు



మాట్లాడుతున్న శివకుమార్

వల్లభాపురం(కొల్లిపర): పార్టీపట్ల అంకితభావం, నిబద్ధతతో ఉన్న వారే నాయకులు, కార్యకర్తలు అలాంటి వారికి పార్టీలో సముచితస్థానం కల్పిద్దాం. వచ్చే ప్రభుత్వం మనదే.. కేవలం పొలిటికల్ గవర్నన్స్ మాత్రమే ఉంటుంది. ఈ నేపథ్యంలో పార్టీని అధికారంలోకి తేవడానికి ప్రతి ఒక్కరూ క్షేత్ర స్థాయి నుంచే సన్నద్ధం కావాలని పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పార్టీ గ్రామ,వార్డు కమిటీల నియామకంలో భాగంగా మండల పరిధిలోనే మున్నంగి గ్రామంలో శుక్రవారం రాత్రి ముఖ్యనేతల సమావేశాన్నిలో కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న శివకుమార్ మాట్లాడుతూ పార్టీ తప్పక ప్రతి కార్యకర్తను గుర్తించే పనిలో ఉందన్నారు. ప్రతి గ్రామంలో కమిటీల ఏర్పాటు పూర్తయిన తర్వాత జనవరిలో ఐడీ కార్డులు ఇస్తారని, ప్రతి కార్యకర్త వివరాలు ,మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేకమైన డాష్ బోర్డులో ఉంటాయన్నారు. వైఎస్సార్ సీపీ గత ఐదేళ్లపాలనలో దేశంలో ఎక్కడా లేని విధంగా ప్రతి ఇంటికి సంక్షేమం, అభివృద్ధి అందించటం జరిగిదని గుర్తుచేశారు. గ్రామ, వార్డు అనుబంధ కమిటీలను పటిష్టంగా నియమించి వారి ద్వారా గ్రామాల్లో సంక్షేమం అందించి పార్టీ బలోపేతం చేయటం జరుగుతుందన్నారు. మరల అధికారంలోకి వచ్చాక గ్రామాల్లో ఇప్పుడు ఏర్పాటు చేసిన ఆయా అనుబంధ కమిటీలతోనే పరిపాలనలో నిర్ణయాధికారం ఉంటుందన్నారు. కావున ఆయా గ్రామ పార్టీ సీనియర్ నాయకులు వారి గ్రామాలల్లో సమర్థులతో కూడిన కమిటీలను నియమించుకోవాలని సూచించారు. కమిటీలు పూర్తి అయిన తరువాత కమిటీ సభ్యులు మెడికల్ కాలేజీల ప్రవేటీకరణకు వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టాలన్నారు.

స్థానిక ఎన్నికలకు సిద్ధం కావాలి

స్థానిక సంస్థల ఎన్నికలు వచ్చే ఏడాది ఫిబ్రవరి, మార్చిలో జరిగే అవకాశాలు ఉంటాయని శివకుమార్ తెలిపారు. పార్టీని గ్రామంలో నాయకులు, అనుబంధ సంఘాలకు సంబంధించిన కమిటీ సభ్యులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేస్తూనే ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. వైఎస్సార్ సీపీ హయాంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టామని గుర్తు చేశారు. గత ఎన్నికల్లో ఓడిపోయినా ఎవరూ ఆత్మస్థైర్యం కోల్పోలేదని, మనకు అధికారమే పరమావధి కాదని తెలిపారు. కూటమి ప్రభుత్వం పోలీస్, రెవెన్యూ వ్యవస్థలను గుప్పిట్లో పెట్టుకుని అక్రమ కేసులు పెడుతున్నా ఎవరూ భయపడడం లేదన్నారు. ఏడాదిన్నరగా చంద్రబాబు, అధికార పార్టీ నేతలు ప్రచారానికే పరిమితమవుతున్నారని దుయ్య బట్టారు, వాస్తవాలను ప్రజలకు వివరించాల్సిన అవసరం ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షులు కళ్ళం వెంకటప్పారెడ్డి, ఆరిగ కోటిరెడ్డి, ఆరిగ అశోక్‌రెడ్డి, ఆళ్ళ శివనాగిరెడ్డి,సుజాత,వేమూరి ధీనమ్మ, కిషోర్ బాబు, భీమవరపు సంజీవరెడ్డి, గ్రామ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.

భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకోండి

మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: పట్టణంలో భవన నిర్మాణాలు జరపదలచినవారు అనుమతులు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 60 గజాల లోపు స్థలం ఉన్న వారు రూ.1 చెల్లించి అనుమతులు పొందవచ్చన్నారు. సెట్ బ్యాక్స్ విషయంలో కొంత సడలింపు కూడా ప్రభుత్వం ఇచ్చిందన్నారు. అనుమతులు తీసుకోకుండా ఎవరైనా భవనాలు నిర్మిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాంటి వారిపై అదనపు ఇంటి పన్ను, విద్యుత్ చార్జీలు వసూలు చేయడం జరుగుంతున్నారు. పట్టణ ప్రజలందరూ సహకరించాలని సూచించారు. వివరాలకు పురపాలక సంఘ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగం సంప్రదించాలని చెప్పారు. అనధికార లే అవుట్‌లు, ప్లాట్స్ క్రమబద్ధీకరణ పథకమును ఈ నెల 23వ తేదీ వరకు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అనధికారకంగా లే అవుట్‌లు వేసిన వారు, ప్లాట్స్ కొనుగోలు చేసిన వారు వీటిని క్రమబద్ధీకరించుకోవాలని సూచించారు.

హోం కంపోస్టుపై అవగాహన ఉండాలి

మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు



మాట్లాడుతున్న కమిషనర్ అప్పలనాయుడు

తెనాలిఅర్బన్: హోం కంపోస్టుపై అందరూ అవగాహన కలిగి ఉండాలని మున్సిపల్ కమిషనర్ జె.ఆర్.అప్పలనాయుడు సూచించారు. 30వ వార్డు అమరావతి కాలనీలో హోం కంపోస్టుపై శుక్రవారం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంట్లో ఉత్పత్తి అయిన తడి, పొడి చెత్తను వేరు వేరుగా ఎరువు తయారు చేయవచ్చని సూచించారు. అందరూ ఇళ్ళలోనే ఈ ప్రక్రియ ప్రారంభించారు. ముందుగా 1,2 శానిటేషన్ డివిజన్ కార్యాలయాలను తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. సమయానికి విధులకు హాజరు కావాలని కార్మికులకు సూచించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొమరబత్తుని జయపాల్, ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు, పలువురు మున్సిపల్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

అంగలకుదురులో మత్తు బిళ్లలు విక్రయం



ఆందోళన చేస్తున్న వారితో మాట్లాడుతున్న పోలీసులు




బాలుడి వద్ద లభించిన మందు బిళ్లలు

- మైనర్లు, యువకులకు షీట్లు లెక్కన అమ్ముతున్న వైనం
- కుమారుడి వింత ప్రవర్తనపై తండ్రికి అనుమానం
- సోదా చేయగా దొరికిన మత్తు బిళ్లలు
- దుకాణం వద్ద ఆందోళన

తెనాలిరూరల్: తెనాలి మండలం అంగలకుదురు గ్రామంలో మైనర్లు, యువకులకు ఓ మెడికల్ షాపు నిర్వాహకుడు మత్తు బిళ్లలు విక్రయిస్తున్న విషయం శుక్రవారం రాత్రి వెలుగులోకి వచ్చింది. ఓ బాలుడి వద్ద బిళ్లల షీట్ గుర్తించిన తండ్రి, బంధువులు దుకాణం వద్దకు వెళ్లి నిలదీయగా దుకాణ నిర్వాహకుడు పరారయ్యాడు. వివరాలిలా ఉన్నాయి. అంగలకుదురుకు చెందిన కొంత మంది యువకులు, మైనర్లు ఇటీవలి కాలంలో వింతగా ప్రవర్తిస్తూ మత్తులో జోగుతున్నారు. ఓ బాలుడు మత్తుగా ఉండడంతో గమనించిన తండ్రి సోదా చేయగా అల్ప్రాజోలం బిళ్లల షీట్ లభించింది. ఇది మత్తు కలిగించే మందులని భావించి కుటుంబసభ్యులు, బంధువులతో కలసి గ్రామ ప్రధాన సెంటరు నుండి రైల్వే స్టేషన్‌కు వెళ్లే మార్గంలోని మెడికల్ షాపు వద్దకు వెళ్లి నిర్వాహకుడిని నిలదీశారు. షాపు ముందు ఆందోళన చేయడంతో నిర్వాహకుడు పరారయ్యాడు. వెనుక బజారులో ఉన్న ఇంట్లోని కుటుంబ సభ్యులనూ తీసుకుని కనబడకుండా వెళ్లిపోయాడు. బాలుడి తరపు వారు దుకాణం వద్ద ఆందోళనను తీవ్రం చేయడంతో సమాచారం అందుకున్న రూరల్ పోలీసులు అక్కడకు వెళ్లి ఆందోనకారులతో మాట్లాడారు. దుకాణాన్ని మూసివేయించి స్టేషన్‌కు వచ్చి ఫిర్యాదు చేయాలని సూచించారు. కాగా బాలుడి వద్ద అల్ప్రాజోలం మాత్రల షీట్ లభించినట్లు బంధువులు తెలిపారు. గ్రామంలో గంజాయికి అలవాటు పడిన కొందరు యువకులు అది దొరకనప్పుడు ఈ మాత్రలను పదుల సంఖ్యలో వేసుకుంటున్నారని, కొందరు మద్యంలో కలుపుకుని తాగుతున్నరని గ్రామస్తులు చెబుతున్నారు. దీనిపై విచారిస్తామని, ఆరోగ్య శాఖ అధికారులను సంప్రదించి మెడికల్ షాపు నిర్వాహకుడిపై చర్యలు తీసుకుంటామని పోలీసులు తెలిపారు.

మధుర రాగాల శిల్పులు సంగీత దర్శకులు



గానాలాపన చేస్తున్న గాయకులు

తెనాలి: సంగీతం, సాహిత్యం, శ్రమజీవుల చైతన్యం కోసం ప్రజానాట్యమండలితో కలిసి ప్రజాసంగీత దర్శకులు తాతినేని చలపతిరావు, సి.మోహన్‌దాస్, బి.గోపాలం జీవితాంతం సంగీత సేవ చేశారని సంస్మరణ కార్యక్రమంలో నివాళులర్పించారు. పట్టణానికి చెందిన అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి, తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణలో భాగంగా శుక్రవారం గాంధీనగర్‌లోని 'ఇస్కఫ్' హాలులో ఆయా సంగీత దర్శకుల సంస్మరణను నిర్వహించారు. ప్రజానాట్యమండలి తెనాలి అధ్యక్షుడు ముక్కాల మాణిక్యాలరావు అధ్యక్షత వహించారు. ముగ్గురు సంగీత దర్శకులు ప్రజానాట్యమండలి సభ్యులుగా అనేక కళారూపాలను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వాడవాడలా ప్రదర్శనలిచ్చినట్టు గుర్తుచేసుకున్నారు. కళలకు, కళారూపాలకు అదొక స్వర్ణయుగంగా చెప్పారు. కమ్యూనిస్టు పార్టీపై నిషేధంతో చెన్నై చేరుకుని సినీరంగ ప్రవేశం చేశారని చెప్పారు. ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి నీలాంబ్రం సంగీత దర్శకుడు తాతినేని చలపతిరావు, సంగీత దర్శకుడు బొల్లిముంత కృష్ణ సి.మోహన్‌దాస్, బి.గోపాలం గురించి మాట్లాడారు. రచయితలు భీమనేని వరప్రసాద్, విజయసారథి, మౌనిక, అనూరాధ మాట్లారు. మోహన్‌దాస్, చలపతిరావు, గోపాలం సంగీత దర్శకత్వం వహించిన సినిమా పాటలను సీహెచ్ అనూరాధ, మౌనిక, నీలాంబ్రం, మాణిక్యాలరావు, విజయసారథి గానం చేశారు.

జ్ఞానమ్మ సేవలు మరువలేనివి

ఫిరంగిపురం: ఆడపిల్లల ఉన్నతికి తాడిపత్రి జ్ఞానమ్మ చేసిన సేవలు ఎనలేనివని సెయింట్ ఆన్స్ సుపీరియర్ జనరల్ సిస్టర్ పి.అంతోనమ్మ అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ తెలుగుమీడియం పాఠశాల ప్లాటినం జూబ్లీ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన దివ్యపూజాబలిలో బాల ఏసుదేవాలయ విచారణగురువు ఫాతిమా మర్రెడ్డి, యూనివర్సల్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ పి.బాలస్వామి, మార్నింగ్ స్టార్ కళాశాల కరస్పాండెంట్ ఫాదర్ మద్దు బాలస్వామి ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం సెయింట్ ఆన్స్ సంస్థ వ్యవస్థాపకురాలు పునీత జ్ఞానమ్మ చిత్రపటానికి సంస్థ సుపీరియర్ జనరల్ సిస్టర్ అంతోనమ్మ పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డెప్యూటీ డీఈవో ఏసురత్నం, ఎంఈవోలు మహబూబ్‌సుబానీ, రవికుమార్, ప్రావిన్షియల్ సుపీరియర్ పి.పాల్ ట్రీజా, సిస్టర్ ఆన్‌రోస్, పాఠశాల హెచ్ఎం వొట్టి థెరసమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్లీన్ ఎయిర్ అంశంపై పోటీలు

మంగళగిరి టౌన్: మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో అంగీకార్ 2025లో భాగంగా విద్యార్థులకు వివిధ అంశాలపై పోటీలు నిర్వహించారు. మంగళగిరి నగర పరిధిలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఎదుట ఉన్న కళావేదికలో శుక్రవారం క్లీన్ ఎయిర్ అంశంపై వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాల విద్యార్థులు చిత్రలేఖనం, క్విజ్ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల విద్యార్థులకు పలు సూచనలు చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ కాలుష్యం వల్ల కలిగే నష్టాలను విద్యార్థులు తెలుసుకోవాలన్నారు. గాలి కాలుష్యంతో కలిగే ఆరోగ్య సమస్యలను వివరించి దాన్ని తగ్గించడానికి అందుబాటులో ఉన్న పరిష్కారాలను విద్యార్థులకు తెలియజేశారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని తద్వారా కాలుష్యాన్ని తగ్గించి స్వచ్ఛమైన వాతావరణాన్ని పొందవచ్చన్నారు. మంగళగిరి నగర పరిధిలోని 27 పాఠశాలలకు చెందిన సుమారు 200 మందికి పైగా విద్యార్థులు పోటీల్లో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్లు ఇందు, కరుణ్, ఎంటీఎంసీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య రహిత దీపావళి జరుపుకొందాం

తాడేపల్లి రూరల్: కాలుష్య రహిత దీపావళిని జరుపుకోవాలని ఎంటీఎంసీ అడిషనల్ కమిషనర్ శకుంతల కోరారు. శుక్రవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి అరవింద హైస్కూల్లో ఎకో ఫ్రెండ్లీ దివాళి అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. అడిషనల్ కమిషనర్ శకుంతల మాట్లాడుతూ దీపావళి సందర్భంగా టపాసులు కాల్చడంతో గాలి కాలుష్యం, శబ్ద కాలుష్యం, వ్యర్థాలు విడుదల కావడంతో పర్యావరణంపై, ప్రజల ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావాన్ని చూపుతాయని పేర్కొన్నారు. పర్యావరణ హితమైన దీపావళిని జరుపుకొనే అలవాటును పెంపొందించేందుకు 'స్వచ్ఛాంధ్ర'లో భాగంగా క్లీన్ ఎయిర్ అనే థీమ్ మీద కార్యక్రమం నిర్వహించామని తెలిపారు. అనంతరం విద్యార్థులకు క్విజ్, డ్రాయింగ్ పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. విద్యార్థులు పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్కిట్స్ వేసి, పాటలు పాడారు. కార్యక్రమంలో పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, సిబ్బంది, మున్సిపల్ సచివాలయ సిబ్బంది, ఐఈసీ కో ఆర్డినేటర్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.